# కాంగ్రెస్ గూండాగిరి

- బీఆర్ఎస్ నేతలపై అకారణంగా దాడి
- ప్రచారం నిర్వహిస్తున్న శ్రేణులపై
- తెగబడిన హస్తం పార్టీ నాయకులు
- సర్జఖాన్‌పేట్‌లో ఇరువర్గాల తోపులాట
- కోస్గి అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా
- రేవంత్‌రెడ్డి డౌన్‌డౌన్ అంటూ నినాదాలు
- ఇదే సమయంలో రాళ్లతో దాడి
- గాయపడిన బీఆర్ఎస్ నాయకులు
- పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యే పట్నం ఫిర్యాదు





బీఆర్ఎస్ నేతలతో గొడవకు దిగిన కాంగ్రెస్ నాయకులు

కోస్గి, నవంబర్ 14 : కొడంగల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకుల రౌడీఇజం రోజు రోజుకూ పెరుగుతున్నది. నిత్యం ఎక్కడో ఒకచోట బీఆర్ఎస్ అభ్యర్థులు, ప్రచారం చేస్తున్న గులాబీ పార్టీ నేతలపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో నారాయణపేట జిల్లా కోస్గి, సర్జఖాన్‌పేట్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఉప్పల్ నియోజకవర్గంలోని సోమశేఖర్ రెడ్డి అనుచరులు 30 మంది మంగళవారం సర్జఖాన్‌పేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ప్రశాంతంగా ప్రచారం చేసుకుంటున్న గులాబీ పార్టీ నేతల వాహనాలపై కాంగ్రెస్ నేత, గ్రామ సర్పంచ్ హరీశ్‌గౌడ్, నాయకుడు లక్ష్మీనారాయణగౌడ్, రాఘవేందర్‌గౌడ్, శెట్టి శివకుమార్, మద్దూరు బాలు, ఉప సర్పంచ్ మూచ అశోక్, ఎండీ కాశీం రాళ్లతో దాడికి పాల్పడ్డారు. దీంతో సోమశేఖర్‌కు చెందిన సఫారీ వాహనం అద్దాలు పగిలిపోయాయి. దీంతో బీఆర్ఎస్ నేతలకు, కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వాదంతో తోపులాట జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని ఇరు వర్గాలను సముదాయించి అక్కడి నుంచి పంపించేశారు. అనంతరం దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు కోస్గి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తరర్వాత స్టేషన్‌ను కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. సీఐతో ఎమ్మెల్యే మాట్లాడి దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేయాలన్నారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్దకు నాయకులు చేరుకొని ధర్నా చేపట్టారు. రేవంత్‌రెడ్డి డౌన్‌డౌన్ అంటూ గులాబీ శ్రేణులు నినాదాలు చేశారు. అయితే ఇదే సమయంలో శివాజీ చౌరస్తాలో ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ శ్రేణులపై ముప్పేట రాళ్ల దాడికి పాల్పడ్డారు. దీంతో పలువురు నేతలకు గాయాలయ్యాయి. విజయ్‌కుమార్, మైబు, లక్ష్మారెడ్డి, రమేశ్‌తోపాటు పలువురు గాయపడగా.. పోలీసులు, స్థానిక నాయకులు కోస్గి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. స్థానిక బీఆర్ఎస్ నేత వెంకటనర్సింహులకు చెందిన షిఫ్ట్ డిజైర్ కారు అద్దాలు కాంగ్రెస్ నేతల దాడిలో పగిలాయి.

## ఓటమి భయంతోనే దాడులు

- దమ్ముంటే ప్రజాక్షేత్రంలో తేల్చుకోవాలి
- రేవంత్‌రెడ్డివి నీతిమాలిన రాజకీయాలు
- కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కోస్గి, నవంబర్ 14 : బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేస్తుంటే ఓడిపోతామనే భయంతో పిరికిపందలా రేవంత్‌రెడ్డి వర్గాలు దాడులకు పాల్పడడం సిగ్గుచేటని కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మండిపడ్డారు. మంగళవారం కోస్గిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్ రెడ్డి ఓడిపోతామని తెలిసి నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రజలను భయబంతులకు గురిచేసి గెలుపొందాలని చూస్తున్నారని ఆరోపించారు. కొడంగల్‌లో రేవంత్‌రెడ్డి ఘోరమైన ఓటమి చవిచూడడం ఖాయమని, ఎన్నిడ్రామాలు చేసినా ప్రజలు నమ్మరన్నారు. గతంలో హస్నాబాద్‌లో ఇలాంటి డ్రామాలే చేశారని గుర్తుచేశారు. నేను సీఎం అయిన తర్వాత మీ అంతు చూస్తానంటూ మీడియాను సైతం బెదిరిస్తున్నారని, ఇంతటి దిగజారుడు రాజకీయాలను గతంలో ఎప్పుడూ తెలంగాణ ప్రజలు చూడలేదన్నారు. సీఎం అవుతానని పగటికలలు కంటున్నారని, ఇలాంటి రౌడీరాజకీయ నాయకులకు ప్రజలే తగిన బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్‌కు అధికారమిస్తే రాష్ట్రం అల్లకల్లోలం అవుతుందనేందుకు బీఆర్ఎస్ నేతలపై జరుగుతున్న దాడులే నిదర్శనమని ప్రజలు గుర్తించాలన్నారు.



సీఐతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి

# ప్రాణవాయువుకు ఊపిరి



గద్వాలలో స్మృతివనం పార్కు

గద్వాలటౌన్, నవంబర్ 14: కాంక్రిట్ జంగిల్‌గా మారిన గద్వాల పట్టణానికి కొ త్త రూపురేఖలు అద్దారు.. రోజురోజుకు కాలుష్యంతో దిగజారిపోతున్న ప్రాణవాయువుకు కొత్త ఊపిరి పోశారు. ప్రతినిత్యం ఆహ్లాదమైన వాతావరణంలో ప్రజలు ఉం డేలా.. ఉత్సాహంగా గడిపేలా పార్కులను తీర్చిదిద్దారు.. పట్టణ నలుమూలల పచ్చదానాన్ని పరిచారు.. ఇందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించింది. పట్టణ ప్రగతి, ఎస్‌డీఎఫ్ నిధులు రూ.9కోట్ల90లక్షలతో 33పార్కులను నిర్మించారు. అంతేకాక వ్యాయామశాల.. వాకింగ్ జోన్లు ఆలా పలు ఏర్పాట్లు చేశారు.. ఇది కదా అభివృద్ధి అనడానికి ఇంతకంటే నిదర్శనం ఏమి కావాలి.గద్వాల మున్సిపాలిటీ పరిధిలో 37వార్డులు ఉన్నాయి. ప్రతివార్డులో పచ్చటి పచ్చదానాన్ని పరిచేలా, వార్డుల ప్రజలకు అహ్లాదమైన వాతావరణం కల్పిచేందుకు హరితహారం స్ఫూర్తితో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతీసుకున్నారు. ఈ మేరకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పార్కుల నిర్మాణాలు చేపట్టారు.

**రూ.7కోట్ల 74లక్షలు వెచ్చించి**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం స్ఫూర్తితో పట్టణంలో రూ.7 కోట్ల 74లక్షలు వెచ్చించి ప్రజలకు ఆహ్లాదమైన వాతావరణాన్ని అందించేందుకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కృషి చేశారు. రూ.7కోట్ల నిధులతో 33 పార్కులను ఏర్పాటు చేశారు. అలాగే 20కిలోమీటర్ల మేర అవెన్యూ ప్లాంటేషన్, 12కిలో మీటర్ల మేరా 50వేల మొక్కలు నాటారు. ఆ మొక్కలు ప్రస్తుతం చెట్లుగా మారి ప్రజలకు నీడ ఇవ్వడమే కాకుండ పట్టణానికి ప్రత్యేక ఆకర్షణంగా నిలిచాయి. లక్షాపదివేల మొక్కల సామర్థ్యం కలిగిన నర్సరీని ఏర్పాటు చేశారు. పీజేపీ కుడి కాలువ పక్కన మురికికూపంగా ఉన్న స్థలాన్ని శుభ్రం చేసి రూ.60లక్షలు వెచ్చించి వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, వాటర్ ఫౌంటేన్ ఏర్పాటు చేశారు. రూ.14లక్షలు వెచ్చించి ట్రాఫిక్ ఐలాండ్‌ను గ్రీన్ ఐలాండ్‌లుగా మార్చారు.

**స్మృతివనం, సంగాల పార్కుల అభివృద్ధి**

పట్టణంలోని రాజీవ్‌మార్గులోని స్మృతివనాన్ని పట్టణ ప్రగతి నిధుల రూ.40లక్షలతో ఆహ్లాదంగా తీర్చిదిద్దారు. అలాగే పట్టణ ఔటర్‌రింగ్ రోడ్డు పక్కన ఉన్న సంగాల చెరువు వద్ద ఎస్‌డీఎఫ్ ని ధులు రూ.కోటి 75లక్షలతో అన్ని వసతులు క ల్పిస్తూ పార్కను ఏర్పా టు చేశారు. సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. జాతీయ భావాన్ని గుండెల నిండా నింపేలా అతిపెద్ద జాతీయ పథాకాన్ని ఏర్పాటు చేశారు. చెరువులో సందర్శకులు బోటింగ్ చేసేలా సౌకర్యం కల్పించారు.

**ఆరోగ్యం.. అంతకుమించి**

మారుతున్న జీవన విధానం, వైరస్‌ల వ్యాప్తి నేపథ్యంలో ఆరోగ్యంపై ప్రజలు ప్రత్యేక దృష్టిసారించారు. ఇందుకు అనుగుణంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పార్కుల నిర్మాణం చేపట్టింది. చిన్నారులు, పెద్దలు ఆకర్షించేలా విభిన్నవిభిన్న థీమ్‌లు, పరికరాలతో పార్కులను అందుబాటులోకి తెచ్చారు. పెద్దలు వాకింగ్, చిన్నారులు ఆడుకునేలా అన్ని వసతులు సమకూర్చారు. ప్రజలకు మంచి ఆరోగ్యాన్ని అందిచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.



సంగాల పార్కు

## ఎన్నికల నిర్వహణపై పటిష్ట నిఘా



ఎన్నికల పరిశీలకుల సమీక్షలో పాల్గొన్న ఎస్పీ రితిరాజ్

గద్వాల అర్బన్, నవంబర్ 14: జిల్లాలో శాసన సభ ఎన్నికలకు సంబంధించి పకడ్బందీగా నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రితిరాజ్ పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణ సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ పరిశీలకులు అనుపమ్ శర్మ(ఐపీఎస్), జనరల్ పరిశీలకులు వసంతకుమార్(ఐఏఎస్)తో కలిసి ఎస్పీ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న రెండు నియోజకవర్గాలకు పోలీస్ నోడల్ అధికారులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల విధులపై పోలీస్ అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించిన వివరాలు తెలియజేశారు. అంతరాష్ట్ర సరిహద్దు వెంట ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వివరాలు, ట్రబుల్స్ మాంగర్స్‌ను బైండోవర్ చేసిన వివరాలు, సమస్మాత్యక పోలింగ్ గ్రామాల్లో చేపట్టిన రక్షణ చర్యలు, ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో వాహనాల తనిఖీలు, కేంద్ర బలగాల సద్వినియోగం, ఫ్లయింగ్ స్క్వాడ్, స్ట్రిక్కింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రింకింగ్ ఫోర్స్ పనివిధానం, సోషల్ మీడియా మానిటరింగ్ మొదలగు అంశాల గురించి వివరించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్న గ్రామాల్లో ప్రణాళికా ప్రకారం రక్షణ చర్యలు తీసుకుంటున్న తీరు, గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడిన వారి వివరాలు, సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న వారిని ముందస్తుగా బెండోవర్ చేసిన వివరాలు, జిల్లాలో ఎన్నికల కోడ్ అనంతరం తనిఖీల్లో సీజ్ చేసిన నగదు, ఇతర వస్తువులు, మద్యం వివరాలు, ఎన్‌బీడబ్ల్యూఎస్ ఎగ్జిక్యూట్ వివరాలు, సి–విజిల్ ద్వారా వచ్చిన ఫిర్యాదుల వివరాలు, కేంద్ర బలగాలతో ఈవీఎమ్ స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత, ఓట్ల కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేయబోయే మూడు అంచల భద్రత గురించి తెలియజేశారు. జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో కేంద్ర బలగాల కవాత్, ప్రజలకు ఓటు వినియోగంపై కళాబృందం ద్వారా చేపడుతున్న అవగాహన కార్యక్రమాల వివరాలు తెలియజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవి, సాయుధ దళ డీఎస్పీ ఇమ్మానియేల్ తదితరులు ఉన్నారు.